కుచేలుడు కృష్ణునిదగ్గరకు పోయినంత సంతోషపడ్డాడు. కాని అంతా కృష్ణులా?

"ఎందుకొచ్చావ్?"... అధికార స్వరంతో అడిగాడు రాజు.

"నేను రంగారావుని, నీ బాల్యస్నేహితుణ్ణి" అని చెబుదామనుకున్నాడు. కాని చెప్పలేకపోయాడు. ఇదివరకే ఆ విషయం నౌకర్లద్వారా తెలియపరచాడు. స్వయంగా తనిప్పుడు కనిపిస్తున్నాడు. రాజు చుట్టూ చాలామంది మిత్రులు చేరారు. వాళ్ళను చూస్తూంటే తనొక మనిషిగా కనపడలేదేమో.

"చెప్పవేం?"అన్నాడు రాజు. అయితే రాజు ఎగాదిగా పరీక్షగా ఏమీ చూడలేదు. మామూలుగా ఒకటిరెండుసార్లు చూచి ఉంటాడు. ఉద్యోగంకోసం వచ్చిన అందరిమల్లేనే తనతో మాట్లాడుతున్నాడు. అక్కడ తనకేం ప్రాముఖ్యం కనబళ్ళా.

"చెప్పవేం?" అన్న గదమాయింపుతో కోలుకొన్నాడు మాటలురాలేదు. తడుముకుంటూ "ఉద్యోగం...ఏదైనా..."

"అబ్బే యిక్కడేం ఖాళీలులేవు. వెళ్ళు. ఇంకానిలుచున్నా వెందుకు. వెళ్ళమని చెప్పటం నీకు కాదూ? వెళ్లు.."

గిర్రున వెనక్కితిరిగాడు రంగా. బయటకొచ్చేశాడు. గోడకుముఖాన్ని చేర్చి భోరున ఏడ్చాడు రంగారావు.

---

స్కెచ్

# మారాజులు

"పతి"

చిన్నతనంలో మొదటిసారి విన్నా నా మాట, ఆయనకేమమ్మా మహారాజు అని. అప్పుడైదారేండ్లకంటే ఎక్కువుండవు. ఒకరోజు ప్రొద్దుటపూట చద్దెన్నం తింటున్నాం, మేం పిల్లలందరం. అమమ్మతోటి జీతగాడు చెప్పాడు పాపిరెడ్డి వస్తున్నాడనిగాదు, పాపిరెడ్డిని తెస్తున్నారని.

పాపిరెడ్డంటే హడలు నాకు. మామయ్యయింటికొచ్చిన మనుష్యులతోటి పాపిరెడ్డిసంగతే మాట్లాడుతుండేవాడు. ఊళ్ళో ఏ పోట్లాటలొచ్చినా, ఎవరితలకాయలు పగిలినా, ఎవరిగడ్డివాములు తగలబడ్డా జాడతెలీకుండా ఏమనషైనా మాయమైనా, ఎప్పుడైనా ఎర్రటోపీల మనుష్యులొచ్చినా పాపిరెడ్డిలేంది పనిసాగేదిగాదు. పాపిరెడ్డి మాటంటే పల్లెమొత్తానికి హడలు. ఒకటిరెండుసార్లు పాపిరెడ్డి మాయింటికి రావటంకూడా జరిగింది. ఒరేయ్ పాపిరెడ్డొచ్చాడు రోయ్ అంటే తలుపుసందుల్లోంచి తదేకంగా చూసేవాళ్ళము. కోరమీసాలు, ఎఱ్ఱటి చింతనిప్పుల్లాంటి కళ్లు నోటిలో యింతపొడుగుచుట్టా, మొదటిసారి చూడంగనే నాగుండెలు మన్నయి.

అప్పుడప్పుడు అమ్మమ్మ రాక్షసుల కథలు చెబుతుండేది. ఆ రాక్షసుల కథలు వినంగానే పాపిరెడ్డి గుర్తొచ్చేవాడు నాకు. ఒకరోజు ఓ రాక్షసుడికథ చెబుతుంటే మా భద్రంగాడడిగాడు రాక్షసులంటే ఎట్లావుంటారని. ఒరే అచ్చం పాపిరెడ్డిలాగా వుంటారు. కాని కాళ్ళూ చేతులూ మాత్రం వెనక్కు తిరిగి వుంటయ్. దున్నపోతులను తింటారు. ఆకాశంలో నడుస్తారుకదా అమ్మమ్మా అన్నాను నేను. పెద్దగా అరవ్వాకు వెధవా, ఎవరైనా వినేరు అన్నది అమ్మమ్మ. అమ్మమ్మలాంటి పెద్దవాళ్ళే జడుసుకుంటుంటే అమ్మో అనుకునేవాణ్ణినేను. సన్నాయిమేళం వినపడుతున్నది. పాపిరెడ్డిని వూరేగిస్తున్నారు కాబోలు. అమ్మమ్మా, యింకా పెద్దవాళ్ళూ అంతా దొడ్డివాకిట్లోకిపోయి చూస్తున్నారు. అమ్మకూడా గబగబా మజ్జిగపోసి పోయింది. నేనూ మా భద్రంగాడు మిద్దెక్కి చూశాం. పాపిరెడ్డిని పండుకోబెట్టి నలుగురు మోసుకుంటూ, తమలపాకులు ఏసుకుంటూ పోతున్నారు. అతడికేం "మారాజులాగా పోయినాడు" అంటున్నది అమ్మ యెవరితోనో. అబ్బో పాపిరెడ్డి రాజై

నాడు గాబోలు. ఈ వెధవను రాజును చేసే బదులు ఏం చక్కా నన్ను రాజును చేసినట్టయితే మా భద్రంగాడిని మంత్రిగాచేసి కథల్లో చెప్పిన రాజకుమారుల్లాగా రాక్షసిని చంపి పారేసి, రాజకుమార్తెను పెండ్లిచేసుకొని, హాయిగా వుండక పోయినానా, అప్పుడు నాచేతులో బోలెడంత సైన్యం వుండేదిగా సింహాసనంమీదనుంచి.

"ఒరే మంత్రివర్యా, భద్రం మన రాజ్యంలో ప్రజలంతా భద్రంగావున్నారో లేదో చూసిరా అనేవాణ్ణి" అని అనుకునేవాణ్ణి.

అమ్మా, పాపిరెడ్డిని మహారాజును చేశారా, అని అడిగాను.

"పో వెధవా అన్నీ నీకే కావాలి" అని కసిరింది మా అమ్మ. భద్రంగాడిని అడిగితే, వాడికీ నాకు తెలిసినంతే తెలిసింది. వాడేం చెపుతాడు? "మరి యీ పెద్దవాళ్ళకే అన్నీ సంగతులు కావాలి" అనుకున్నాను. ఆ రోజులు, ఆ తలపులు, ఆ మాటలు యిప్పుడు గుర్తు తెచ్చుకుంటుంటే నవ్వొస్తుంది. కాని ఆ మహారాజు శబ్దం మాత్రం మరచిపోలేదు. రోజుకు చాలామంది మహారాజులౌతున్నారు. ఒకరేమిటి పోయినవాడల్లా ప్రభువే ఇంతమందికి రాజ్యాలెక్కడి నుంచి వస్తున్నయ్! ఆడవాళ్ళకు రాజ్యాలూ, మొగవాళ్ళకు రాజ్యాలూ, వింటుంటే నవ్వొస్తుంది.

మొన్న కుమ్మరిపేరమ్మ కాస్తా భూమిలో కలసిపోయింది. పదిరోజులైన తర్వాత దాని కోడలు మా యింటికొచ్చి మహారాజులాగా దాటిపోయిందమ్మగారూ, అని కండ్ల నీరు బెట్టుకుంది. బ్రతికినన్నాళ్లు దానికీ దీనికీ చుక్కెదురు. పోయేటప్పుడు మహారాజును చేసి పంపించింది కాబోలు పాపం. రోజూ తిట్టుకునే వాళ్లే కాని చచ్చిపోయిన పదిరోజుల తర్వాతకూడా మహారాజులాగా పోయిందంటూ గుడ్లనీరు గ్రుక్కుకుంది కోడలు.

అంతదాకా యెందుకు! నాజరుసాయెబు పోయినరోజున 'మహారాజు'ను పంపించినట్లు పంపించారు. పదిరోజులక్రిందట తిరగేసి, మరగేసి దంచి, ఆస్పత్రిల్లోచేర్చిన కొడుకుగూడా శోకాలు తీస్తుంటే, వాడికేం? "మారాజులాగా పోయినాడు" అన్నారు అందరూ. నాజరుసాయెబు నిజంగా మహారాజైతే వాలికున్న మనుష్యులల్లా నీలుక్కోవాల్సిందే. సారావృత్తి పెరుగుతుంది. ముఖ్యపరిశ్రమల్లో ఒకటైతుంది సారాపరిశ్రమ. ప్రొహిబిషన్ డిపార్టుమెంటు వారికి కొద్దిగాకూడా తీరుబాటు వుండదు. అసలు ప్రొహిబిషనే వుండదు. బుంగలు బుంగలు, సారాయితెచ్చి నాజరుసాయబుకి ప్రెజెంటుచేస్తే కోరుకున్న ఉద్యోగం యిప్పిస్తాడు నాజరుసాయబు. బ్రతికినన్నాళ్ళూ ఎట్లా బ్రతికినా, పోయేటప్పుడు మాత్రం మహారాజులాగా పోయినాడు నాజరుసాయెబు. అత్తరూ, సెంటూ, ఘుమఘుమా...

నాకు బాగా బుద్ధీ, జ్ఞానమూ, సదువూ, సంధ్యా అబ్బిన తర్వాతనే ఒకరోజున మా తాతయ్య కాస్తా హరీ అన్నాడు. మా అత్తయ్య అంటే మా తాతయ్య కూతురన్నమాట, ఆయన్ను క్రిందికి దించంగనే వొక్కసారే రైలుకూతలాగా మోత ఎత్తేసింది. మూడో గంటకొట్టి రైలు కూతేసి కదలబోయేటప్పుడు ప్రయాణీకులు పరుగెత్తుతారే అట్లా పరిగెత్తి మా యింటిప్రక్కనున్న పూర్వాసువాసినిగారు వచ్చి "ఆయనకేమమ్మా మారాజులాగా దాటిపోయినారు. మునిమనవలూ, మనుమలకు మనుమలు పుట్టబోతుంటే," అన్నది యింకేటా పరామర్శా పాకులేకుండా, నాకు నవ్వాలో, యేడవాలో కూడా తోచలేదు. తరువాత మా తాతయ్య మహారాజులంగారుకూడా పచ్చిబద్దల రథంమీద వూరేగి, అగ్నిహోత్రుని సమక్షంలో రాజ్యాన్ని స్వీకరించాడనుకోండి. ప్రతివొక్కడూ మహారాజే. పుట్టిచచ్చినవాడల్లా మహారాజైపోతాడు. పుట్టిచ్చేటప్పటికంటేగిట్టిచ్చేటప్పటికి ఆ దేవుడికి గట్టిదిక్కే. ఆయన పుటం పుటుక్కున తెగుతుంది. ఎందుకంటే యిన్ని రాజ్యాలను ఆయనెక్కడ సృష్టిస్తాడు? చచ్చిపోయినవాడల్లా మహారాజత్వాన్ని తగిలించుకొని మరీ చస్తుంటే! రాజ్యాలనూ, రాజులనూ, ఏవగించుకున్న భర్తృహరిగూడా చింతచెట్లక్రింద గుడ్ల సమక్షంలో రాజ్యాన్ని ఏలివుంటాడు. అంతే కదూ?

★